

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరిస్తున్న భక్తులు

# గూడెంలో వైభవంగా మార్గశిర పౌర్ణమి జాతర

**సామూహిక వ్రతాలు ఆచరించిన భక్తులు**

దండేపల్లి, డిసెంబర్ 26 : దండేపల్లి మండలంలోని గూడెం సత్యనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం మార్గశిర పౌర్ణమి జాతర వైభవంగా సాగింది. వేకువజామునే పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. 169 జంటలు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించాయి. ఆలయంలో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. 800 మంది భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్,అర్చకులు రఘుస్వామి, సంపత్ స్వామి, వేదపండితులు నారాయణశర్మ, సిబ్బంది ఉన్నారు.



నిర్మాణంలో ఉన్న గదులను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయి

# డార్ఫ్ దంపతుల వర్ధంతి ఘనంగా నిర్వహించాలి

**ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయి**

జైనూర్ డిసెంబర్ 26 : వచ్చే నెల 11న డార్ఫ్-బెట్టి ఎలిజబెత్ దంపతుల వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని మార్లవాయి గ్రామాన్ని ఆమె సందర్శించారు. ఆశ్రమ పాఠశాలలోని తరగతి, వంట గదులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని సూచించారు. అనంతరం గ్రామ సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆమెను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏఈ శివప్రసాద్, ఏఈ ఇందల్, ఉప సర్పంచ్ జుగ్నక సావిత్రి ధర్మేందర్, గ్రామ పటేల్ ఆత్రం హన్మంత్ రావ్, హెచ్‌ఎం వెంకటరమణ, సార్ మేడి దేవ్ రావ్, మాజీ సర్పంచ్ కనక కొద్దు, హైమన్ డార్ఫ్ యూత్ సభ్యులు మధురాజ్, లింగు, గుస్సాడీ టీం లీడర్ కనక సుదర్శన్, గ్రామస్తులు ఉన్నారు.

# 11న అవిశ్వాస తీర్మానాలు



మంచిర్యాల, డిసెంబర్ 26(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల, బెల్లంపల్లి మున్సిపాలిటీల్లో జనవరి 11వ తేదీన అవిశ్వాస తీర్మానాలు ప్రవేశ పెట్టనున్నారు. ఈ రెండు మున్సిపాలిటీల కౌన్సిలర్లు ఇటీవల కలెక్టర్‌ను కలిసి చైర్మన్లపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాలని వినతి పత్రాలు సమర్పించారు. అంతకు ముందు బెల్లంపల్లి మున్సిపల్ కౌన్సిలర్ జక్కుల శ్వేత, మంచిర్యాల కౌన్సిలర్లు కొందరు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంచిర్యాల జిల్లాలోని నస్పూర్, లక్షెట్టిపేటలోనూ ఈ తరహా చేరికలు జరిగాయి. దీంతో ఈ నాలుగు మున్సిపాలిటీల మీద కాంగ్రెస్ కన్నేసింది. సాధారణ ఎన్నికలు పూర్తయిన మరుసటి రోజు నుంచే జిల్లాలోని మున్సిపాలిటీలను కాంగ్రెస్ హస్తగతం చేసుకోవాలని ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఆ దిశగా కౌన్సిలర్లను టార్గెట్ చేసింది. ప్రజాస్వామ్య హితంగా ఎన్నుకున్న కౌన్సిలర్లు ఉన్న ఫలంగా వెళ్లి కాంగ్రెస్‌లో కలవడంపై ప్రజలు మండి పడుతున్నారు. ఈ రెండు మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానం పూర్తి కాగానే.. నస్పూర్, లక్షెట్టిపేటలోనూ తీర్మానాలు పెట్టనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

# సింగరేణి సమరం నేడే..

- 'గుర్తింపు' సంఘం ఎన్నికలకు సర్వం సిద్ధం
- ఓటు వేయనున్న 39,827 మంది కార్మికులు
- ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల దాకా పోలింగ్
- ఆపై ఫలితాలు
- బరిలో 13 కార్మిక సంఘాలు

*సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల సమరానికి సర్వం సిద్ధమైంది. నేడు 11 ఏరియాల్లో పోలింగ్ నిర్వహించేందుకు యంత్రాంగం సన్నద్ధమైంది. మొత్తం 13 సంఘాలు పోటీ చేస్తుండగా, 84 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. 39,827 మంది ఓటు హక్కును వినియోగించుకోనుండగా, ఆ వెంటే కౌంటింగ్ పూర్తి చేసి ఫలితాలు వెలువరించనున్నది.*

శ్రీరాంపూర్/మందమర్రి/రామకృష్ణాపూర్/సీసీసీ నస్పూర్/రెబ్బెన/తాండూర్, డిసెంబర్ 26 : సింగరేణిలో ఈ నెల 27న ఏడోసారి గుర్తింపు సంఘం ఎన్నికలు జరుగనున్నాయి. ఆరు జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఎలక్షన్లు ఉండనున్నాయి. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అదే రోజు రాత్రి 7 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. అనంతరం ఫలితాలు వెలువడనున్నాయి. గుర్తింపు పోరులో మొత్తం 13 కార్మిక సంఘాలు పోటీ పడుతున్నాయి. మొత్తం 11 ఏరియాల పరిధిలో 39,827 మంది కార్మికులు ఓటు హక్కు వినియోగించుకోనుండగా, అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మొత్తం 84 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. ఇప్పటికే పోలింగ్, కౌంటింగ్ సిబ్బందిని నియమించి, శిక్షణ తరగతులు కూడా నిర్వహించారు. ఆర్టీవో, తహసీల్దార్ అధికారులను పర్యవేక్షకులుగా నియమించారు. పోలింగ్ రోజు ప్రతి ఉద్యోగి తమ గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలని సూచించారు.



సీసీసీ సింగరేణి ఆఫీసర్స్ క్లబ్ హాల్‌లో కౌంటింగ్‌కు ఏర్పాట్లు



పోలింగ్ సామగ్రితో విధులకు వెళ్తున్న సిబ్బంది

## మందమర్రిలో..

మందమర్రి ఏరియాలో నాలుగు భూగర్భ గనులు, రెండు ఉపరితల గనులుండగా, ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా గనులతో పాటు ఏరియా వర్క్‌షాప్, వైద్య విభాగం, సివిల్ డిపార్ట్‌మెంట్, ఇతర డిపార్ట్‌మెంట్‌లలో మొత్తం 4835 మంది పర్మినెంట్ ఉద్యోగులున్నారు. ఏరియాలో 11 మంది పీవోలు, 11 మంది ఏపీవోలు, 22 మంది వివిధ శాఖల అధికారులు ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారు. మందమర్రి పట్టణంలోని సీఈఆర్ క్లబ్‌లో ఓట్ల కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సీఈఆర్ క్లబ్‌లో సిబ్బందికి పోలింగ్ సామగ్రిని అందజేశారు. మంగళవారం సాయంత్రం ప్రత్యేక వాహనాల్లో పోలింగ్ బూత్‌లకు తరలివెళ్లారు. బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య ఆధ్వర్యంలో మందమర్రి సీఐ మహేందర్ రెడ్డి పర్యవేక్షణలో ఎస్‌ఐ చంద్రకుమార్‌తో పాటు ఐదుగురు సీఐలు, 15 మంది ఎస్‌ఐలతో మొత్తం 165 మంది సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఏసీపీ సదయ్య తెలిపారు. అన్నిచోట్ల 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు.

## జైపూర్ ఏసీపీ పర్యవేక్షణలో బందోబస్తు

సింగరేణిలోనే పెద్ద ఏరియా అయిన శ్రీరాంపూర్‌లో 9,149 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరంతా ఓటు వేసేందుకు శ్రీరాంపూర్ ఏరియాలోని గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద 15 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్‌కేంద్రానికో ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఇద్దరు ఇతర పోలింగ్ ఆఫీసర్లను కేటాయించారు. మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆధ్వర్యంలో జైపూర్ ఏసీపీ మోహన్ పర్యవేక్షణలో ఇద్దరు సీఐలు, 10 మంది ఎస్‌ఐలు, 150 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత సీసీసీలోని సింగరేణి ఆఫీసర్స్ క్లబ్‌కు బ్యాలెట్ బాక్సులు తరలించనున్నారు. ఇక్కడే కౌంటింగ్ నిర్వహించనున్నారు. జైపూర్ ఏసీపీ మోహన్, శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

## బెల్లంపల్లి ఏరియాలో..

బెల్లంపల్లి ఏరియాలోని వివిధ గనులు, డిపార్టుమెంట్‌లలో 996 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ఏరియాలో మొత్తం 5 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. బూత్‌కొకరి చొప్పున ఐదుగురు పీవోలు, ఒక రిజర్వ్ అధికారి, ఐదుగురు ఏపీవోలు, 10 మంది అదనపు ఎన్నికల సిబ్బంది, పోలింగ్ ఆఫీసర్లు, ఇద్దరు రిజర్వ్ ఆఫీసర్లు, కౌటింగ్ కోసం నలుగురు సూపర్‌వైజర్లు, ఎనిమిది మంది అసిస్టెంట్ సూపర్‌వైజర్లను నియమించినట్లు రిటర్నింగ్ ఆఫీసర్ కేజే మహంతి తెలిపారు. గోలేటిటౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. 5 పోలింగ్ కేంద్రాలతో పాటు కౌటింగ్ కేంద్రాన్ని మంగళవారం ఆసిఫాబాద్ డీఎస్పీ వెంకటరమణ, బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్, ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ కేజే మహంతి పరిశీలించారు. డీఎస్పీ ఆధ్వర్యంలో సీఐ, ఆరుగులు ఎస్‌ఐలు, 50 మంది సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నారు. రెబ్బెన ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో వెంకటేశ్వరస్వామి, సీఐ అల్లం నరేందర్, ఎస్‌ఐ చంద్రశేఖర్, ఏరియా ఎస్‌వోటూజీఎం మచ్చగిరి నరేందర్, ఐఈడీ అధికారి ఉజ్వల్‌కుమార్‌బెహరా, సెక్యూరిటీ అధికారి వరప్రసాద్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనీయర్ పీవో మండల శ్రీనివాస్ ఉన్నారు.



సీసీసీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

## ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలి

**-కలెక్టర్ బదావత్ సంతోష్**

సీసీసీ నస్పూర్, డిసెంబర్ 26 : సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సీసీసీ, శ్రీరాంపూర్ ప్రాంతంలో ఎన్నికల ఏర్పాట్లు, కౌంటింగ్ కేంద్రాన్ని డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, జైపూర్ ఏసీపీ మోహన్, ఆర్డీవో రాములు, శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, డీజీఎం పర్సనల్ అరవిందరావుతో కలిసి పరిశీలించారు. ఎన్నికల సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు.

| ఏరియాలు | ఓటర్లు | బూత్‌లు |
|---|---|---|
| కొత్తగూడెం కార్పొరేట్ | 1,191 | 06 |
| కొత్తగూడెం ఏరియా | 2,331 | 05 |
| ఇల్లందు ఏరియా | 631 | 03 |
| మణుగూరు ఏరియా | 2,452 | 07 |
| రామగుండం-1 ఏరియా | 5,404 | 11 |
| రామగుండం-2 ఏరియా | 3,557 | 06 |
| రామగుండం-3 ఏరియా | 3,884 | 06 |
| భూపాలపల్లి ఏరియా | 5,395 | 09 |
| బెల్లంపల్లి ఏరియా | 998 | 05 |
| మందమర్రి ఏరియా | 4,835 | 11 |
| శ్రీరాంపూర్ ఏరియా | 9,149 | 15 |
| మొత్తం | 39,827 | 84 |

# ఇదే ఇగం

- ఉమ్మడి జిల్లాను వణికిస్తున్న చలి
- పడిపోయిన ఉష్ణోగ్రతలు
- పొగమంచుతో ఇబ్బందులు

*ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను చలి వణికిస్తున్నది. ఉష్ణోగ్రతలు పడిపోయి తీవ్రత పెరిగింది. మంగళవారం కనిష్ఠంగా 8.9 డిగ్రీలు నమోదుకాగా, ఉదయం 6 నుంచి 9 గంటల వరకు దట్టమైన పొగమంచు కమ్ముకున్నది. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. తప్పనిసరి పరిస్థితుల్లో హెడ్‌లైట్లు వేసుకొని ప్రయాణించాల్సి పరిస్థితి నెలకొంది. ఇక సాయంత్రం ఆరింటి కంటే ముందే కూలీలు, రైతులు పనులు ముగించుకొని ఇళ్లకు చేరారు. చిన్నా పెద్దలంతా ఒకేచోట చేరి చలిమంటలు వేసుకున్నారు.*

**- బెజ్జూర్, డిసెంబర్ 26**



ఉదయం 7 గంటలకు లైట్లు వేసుకొని వెళ్తున్న వాహనం



కుకుడ లో పత్తి చేనుపై కమ్ముకున్న పొగమంచు


నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-314383-AII

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677



# ఉద్యోగం పేరిట ఊడ్చేస్తారు..

**'ఆన్‌లైన్'లో జాబ్స్ కోసం వేతికేవాళ్లు తస్మాత్ జాగ్రత్త**

- తక్కువ పని, ఎక్కువ ఆదాయం అంటూ ఆకర్షించే యత్నం
- క్లిక్ చేశామా.. బ్యాంక్ ఖాతాలోని డబ్బులు మాయం
- జాబ్ ఫ్రాడ్‌తో ఇబ్బందులు పడుతున్న యువత

*ఆదిలాబాద్‌కు చెందిన అఖిల హౌస్ వైఫ్. పార్ట్‌టైమ్ జాబ్ కోసం ఆన్‌లైన్‌లో కొన్ని వెబ్‌సైట్లు సెర్చ్ చేసింది. ఈ క్రమంలో రోజుకు రూ.3వేల నుంచి రూ.7,500 వరకు సంపాదించే జాబ్ ఉంది అనే బ్లాగ్ ఓపెన్ చేయగా.. అది డీటెయిల్స్ అడిగింది. మరుసటి రోజు వాట్సాప్‌లో ఒక సందేశం వచ్చింది. మీరు జూమ్ మీటింగ్ అటెండ్ అయితే మిగిలిన వివరాలు చెప్తామని చెప్పారు. అందుకు రూ.450 తీసుకున్నారు. మీటింగ్‌లో టైపింగ్ వర్క్ చేయాలని ట్రేయినింగ్ కోసం రూ.9 వేలు కట్టాలని చెప్పారు. విషయం ఆమె భర్తకు చెప్పడంతో ఉద్యోగం చేస్తే డబ్బులు ఇవ్వాలి. కానీ.. మనం డబ్బులు కట్టడం ఏంటని.. ఆ పని వద్దని చెప్పాడు. దీంతో తృటిలో ప్రమాదం తప్పింది.*

మంచిర్యాల, డిసెంబర్ 26(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, ఉద్యోగాల కోసం ఆన్‌లైన్‌లో వెతుకుతున్న పేద యువకులు, నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకుని కొందరు సైబర్ నేరగాళ్లు ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారు. తక్కువ పని, అధిక ఆదాయం అంటూ పోస్టులు పెడుతూ బురిడీ కొట్టిస్తున్నారు. ఈ ప్రకటనలు నమ్మి ఉద్యోగం కోసమని ఆన్‌లైన్‌లో క్లిక్ చేస్తే.. మన బ్యాంక్ అకౌంట్‌లో ఉన్న డబ్బులు ఊడ్చేస్తున్నారు. ఆన్‌లైన్ వర్క్, టాస్క్‌లు అంటూ పెట్టుబడి పెట్టించి మోసం చేస్తున్నారు. ఇలా.. భారీగా ఆదాయం అంటూ ప్రకటనలు ఇస్తున్నారంటే దాని వెనుక సైబర్ నేరగాళ్లు ఉన్నారనే విషయాన్ని గ్రహించాలని సైబర్ భద్రత నిపుణులు సూచిస్తున్నారు. ఒకసారి గూగుల్‌లో సెర్చ్ చేసి మన మెయిల్ ఐడీ, ఫోన్ నంబర్ ఇచ్చామా అంటే అంతే సంగతులు. ఉద్యోగాల పేరిట మెయిల్‌కు మొబైల్‌కు లింక్ పంపిస్తారని, వాటిని ఏ మాత్రం క్లిక్ చేసినా మన సమాచారం మొత్తం తెలుసుకొని అకౌంట్‌లోని డబ్బులన్నీ ఊడ్చేస్తారని హెచ్చరిస్తున్నారు. మన వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ అకౌంట్ డీటెయిల్స్ అన్ని వారి చేతుల్లోకి వెళ్లిపోతాయి. కొద్దిపాటి జాగ్రత్తలతో నేరగాళ్ల భారీ నుంచి కాపాడుకోవచ్చని సూచిస్తున్నారు.




పార్ట్‌టైమ్ జాబ్ అంటూ ఒక యువకుడి వాట్సాప్‌కు వచ్చిన సందేశం

*మంచిర్యాల జిల్లాకు చెందిన కృష్ణ పని కోసం హైదరాబాద్ వెళ్లాడు. ఓ పెద్ద బ్యాంక్‌లో కార్ లోన్ల రికవరీ ఉద్యోగం దొరికింది. వారం రోజులకు ఓ కస్టమర్ నుంచి ఈఎం ఐ డబ్బులు రూ.80 వేలు వచ్చాయి. రాత్రి పేమెంట్ చేతికి రావడంతో డబ్బులు తన అకౌంట్‌లోనే ఉంచుకున్నాడు. ఇంకా ఏదైనా పార్ట్‌టైమ్ ఉద్యోగం చేద్దామని గూగుల్‌లో సెర్చ్ చేశాడు. రోజుకు రూ.20 వేల నుంచి రూ.25 వేలు సంపాదించవచ్చు అనే యాడ్ కనిపించింది. దానిపై క్లిక్ చేయగానే ఫోన్ నంబర్ అడిగింది. ఎంటర్ చేయగానే వాట్సాప్ సందేశం వచ్చింది. పార్ట్ టైమ్ జాబ్ రోజూ కొన్ని టాస్క్‌లు కంప్లీట్ చేస్తే టాస్క్‌కు కొంత చొప్పున డబ్బులు ఇస్తామని ఉంది. తొలి టాస్క్‌కు రూ.100 పెట్టుబడి పెడితే రూ.600 తిరిగి వస్తాయనే సందేశం వచ్చింది. రూ.100 కదా అని తొలి టాస్క్ పూర్తి చేయగా రూ.600 వచ్చాయి. అలా తరువాత టాస్క్‌ల నుంచి పెట్టుబడి పెరిగి వచ్చే అమౌంట్ పెరుగుతూ వచ్చింది. చివరకు బ్యాంక్ డబ్బుల నుంచి రూ.72 వేల పెట్టుబడి పెట్టాక టాస్క్ మధ్యలో ఇది పూర్తి చేయాలంటే మరో రూ.లక్ష కావాలనే సందేశం వచ్చింది. దీంతో హైరానా పడిపోయిన కృష్ణ ఏం చేయాలో తెలియక తెల్లముఖం వేశాడు. బయటికి చెప్తే పరువు పోతుందనుకొని మిన్నకుండిపోయాడు. ఆఫీస్ డబ్బులు వాడుకున్నందుకు కృష్ణ ఉద్యోగం పోయింది. అప్పు చేసి బ్యాంక్ డబ్బులు తిరిగి కట్టాడు. స్నేహితులకు ఈ విషయం చెప్పుకొని బోరున విలపించాడు.*

## జాగ్రత్తలు..

- ఆన్‌లైన్ జాబ్ పేరిట ఒక పనికి సాధారణం కంటే అధిక వేతనం ఇస్తామనే ప్రకటలను మోసమని గుర్తించాలి. అలాంటి సైట్‌ను ఓపెన్ చేయవద్దు. ● ఈ-మెయిల్స్‌లో అక్షర దోషాలు, ఫోన్ నంబర్లు లేకుండా ఉంటే అది కచ్చితంగా మోసపూరితమైన లింక్ అని పసిగట్టాలి.
- ఆన్‌లైన్, జూమ్ కాల్స్ ఇంటర్వ్యూలు చేస్తామంటూ వచ్చే సందేశాలను నమ్మవద్దు. ● వ్యక్తిగత సమాచారంతోపాటు పాన్, ఆధార్ కార్డు, బ్యాంక్ వివరాలు ఇవ్వాలని అడిగారంటే అది మోసమని గుర్తించాలి. ● ఆకర్షణీయమైన ప్యాకేజీ అంటూ ప్రకటనల రూపంలో వచ్చే వెబ్‌లింక్‌లను ఓపెన్ చేయవద్దు.
- మనల్ని పెట్టుబడి పెట్టామన్నారంటే అది పెద్ద మోసమని గ్రహించాలి. ● నౌకరీ డాట్.కామ్, లింక్‌డ్ ఇన్, ఇన్‌డీడ్ వంటి వెబ్‌సైట్ల ఆధారంగా జాబ్ వెతుక్కోవాలి.



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు

# 'ప్రజా పాలన'ను విజయవంతం చేయాలి

- అధికారులందరూ తప్పక హాజరవ్వాలి
- జీపీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలి
- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 26 : గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, ఆర్డీవోలు కదం సురేష్, కాసబోయిన సురేష్‌తో కలిసి జిల్లా అధికారులు, తహసీల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి, మండల పంచాయతీ అధికారులు, నాయబ్ తహసీల్దార్లకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి వచ్చేనెల జనవరి 6వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రజాపాలన కార్యక్రమానికి అధికారులంతా తప్పక హాజరుకావాలని సూచించారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పా టు చేసి మహాలక్ష్మి, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాల అమలు కోసం దరఖాస్తులు స్వీకరించాల ని ఆదేశించారు. ప్రతి మండలంలో 2 బృందాలను ఏర్పాటు చేసి గ్రామ సభలు నిర్వహించాలని, ప్రతి బృందంలో 10 మంది అధికారులు ఉంటారని, దరఖాస్తులు స్వీకరణకు ముందు రోజే గ్రామాల్లో టామ్ టామ్ ద్వారా ప్రజలందరికీ తెలియజేయాలని కోరారు.